నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

వంగూరు: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం మండలం కేంద్రంలో రూ.43 కోట్లతో చేపట్టనున్న రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీశైలం హైవేలో ఉన్న సర్వారెడ్డిపల్లి స్టేజీ నుంచి వంగూరు, కొండారెడ్డిపల్లి మీదుగా తిమ్మరాసిపల్లి వరకు దాదాపు 21 కిలోమీటర్ల బీటీ రోడ్డును రూ.35 కోట్లతో డబుల్ బీటీగా మారుస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా శ్రీశైలం హైవే నుంచి వంగూరు, నర్సంపల్లి నుంచి కోనేటిపూర్ గ్రామాలకు రూ.8 కోట్లతో నూతనంగా బీటీ రోడ్డును నిర్మించనునట్లు తెలిపారు. మండలంలోని రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేస్తానన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

మండల కేంద్రంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. యువత క్రీడలవైపు ఆసక్తి కనబర్చాలని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారులను వెలికితీసేందుకు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ పండిత్‌రావు, ఆర్ అండ్‌బీ డీఈ నాగలక్ష్మి, మండల కాంగ్రెస్ నాయకులు పాండురంగారెడ్డి, రమేష్‌గౌడ్, క్యామ మల్లయ్యతోపాటు పలువురు పాల్గొన్నారు.


వంగూరులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలి

అచ్చంపేట రూరల్: ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ కోరారు. శనివారం పట్టణంలోని జీఎస్‌ఆర్ ఆదిత్య, కాకతీయ స్కూల్‌లో ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. విద్యార్థినుల రంగవల్లులు, హరిదాసు వేషధారణ, భోగి మంటలు, బోనం వంటకం వంటి కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. సీబీఎం చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ డాక్టర్ అనురాధ, కరస్పాండెంట్ హలరాజు, సూర్య, శ్రీనివాసులు, కౌన్సిలర్ సునీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ అడ్వకేట్ గంగాపురం రాజేందర్‌ను ఉమా మహేశ్వర ఆలయం కమిటీ పాలక మండలి సభ్యురాలు సంబు శోభ వెంకటరమణ శనివారం సన్మానించారు. మన్ననూర్‌లో కొంత కాలంగా అస్తవ్యస్తంగా ఉన్న అంబేడ్కర్ గ్రంథాలయాన్ని పునరుద్ధరించి పాఠకులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి రజిత మల్లేష్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జూనియర్ లైన్‌మెన్ మృతి

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్లలో శనివారం తెల్లవారుజామున మాచుపల్లి రఘు (35) జూనియర్ ట్రాన్స్‌కో లైన్‌మెన్ గుండెపోటుతో మృతి చెందాడు. తెల్లవారుజామున చాతిలో నొప్పి వస్తుందని లైన్‌మెన్ రఘు కుటుంబ సభ్యులకు తెలిపాడు. వెంటనే కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య అపర్ణ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

అర్హులందరికీ రైతుభరోసా ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పేరుతో ఇవ్వనున్న రూ.12 వేలు ఎలాంటి షరతులు లేకుండా ఇవ్వాలని బీఎంపీ పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ గడ్డం విజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూమిలేని పేదలందరికీ న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం ఉపాధి పని చేసేవారికే పథకాన్ని వర్తింపజేస్తామనడం సరికాదన్నారు. సమావేశంలో నాయకులు భీమయ్య, ఎర్రోల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల విరాళం




వెల్దండ: మండల కేంద్రంలోని మడేలయ్య స్వామి దేవాలయ నిర్మాణానికి సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్ శనివారం రూ.2 లక్షల విరాళాన్ని ఉత్సవ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి దాతలు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, పుల్లయ్య, హమీద్, రజకసంఘం అధ్యక్షుడు రేవలి రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మట్ట భరత్‌గౌడు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

శివకుమార్‌ను సన్మానించిన కేంద్రమంత్రి

కల్వకుర్తిరూరల్: కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు శనివారం ఢిల్లీలో పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్‌ను ఢిల్లీలో సన్మానించారు. వికసిత భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ జాతీయ యువజన ఉత్సవాలలో శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివివేకానంద సేవా బృందం చేస్తున్న సేవ కార్యక్రమాలను మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి అభినందించి సన్మానించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



చారకొండ: మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు ఎల్క శ్రీను శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెల్దండ సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట నాయకులు వెంకటయ్య యాదవ్, ముజ్జు, తదితరులు ఉన్నారు.

పట్టణ అధ్యక్షుడిగా బాబిదేవ్

కల్వకుర్తిరూరల్: బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా బాబిదేవ్ ను శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణ, మండల కమిటీలను ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తోటపల్లి మాజీ ఉప సర్పంచ్ నరేష్‌గౌడ్ ఎన్నికయ్యారు. మండల ప్రధాన కార్యదర్శిగా కిష్టారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శిగా వివేకనందలను ఎన్నుకున్నారు.

ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి


నాగర్‌కర్నూల్‌లో వడ్డెర ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం వడ్డెర ఓబన్న 218వ జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు కాళ్ల నిరంజన్, నవీన్ కుమార్‌లో పాటు వడ్డెర సంఘం నాయకులు పాల్గొని వడ్డె ఓబన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో వడ్డెర సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కొల్లాపూర్ నియోజకవర్గ బీసీ ఇన్‌చార్జ్ డాక్టర్ కురుమూర్తి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వడ్డెర సంఘం మండల అధ్యక్షుడు పసుపుల నరసింహ, ఉపాధ్యక్షుడు మల్లేష్, మద్దిలేటి, రమేష్, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి పి మల్లేష్, చిన్న సుల్తాన్, రవి, శేఖర్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



కల్వకుర్తి రూరల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపూర్‌లో శనివారం వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన జిల్లా చైర్మన్ బండెల రామచంద్రా రెడ్డి సమకూర్చిన 200 దుప్పట్లు, 200 రగ్గులను క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డితో కలిసి రాంరెడ్డి లయన్స్ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి అందజేశారు. కోశాధికారి గుజ్జేరి నరసింహ, జిల్లా చైర్మన్ లయన్ జూలూరి రమేష్ , లయన్ సభ్యులు పసుల నరసింహారెడ్డి, వెంకటపూర్, వెంకటాపూర్ తండా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

వెల్టూరును మండల కేంద్రం చేయాలి

ఉప్పునుంతల: మండలంలోని వెల్టూరు మేజర్ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల జగత్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. వెల్టూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తే శ్రీశైలం- హైదరాబాద్ రహదారికి తూర్పు దిశగా ఉన్న లత్తీపూర్, గువ్వలోనిపల్లి, సీబీతండా, పూర్యనాయక్ తండా, ఈరట్వానిపల్లి, అయ్యవారిపల్లి, రాయిచెడ్, సూర్యతండా గ్రామ పంచాయతీలకు పాలనపరంగా సౌకర్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

చెక్ అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూల గ్రామానికి చెందిన మౌనికకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి రూ.15 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబసభ్యులకు నాయకుడు గణేష్ చెక్కు అందజేశారు.

తాడూరు: మండల కేంద్రానికి చెందిన కృష్ణయ్యకు సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి మంజూరైన చెక్‌ను శనివారం లబ్ధిదారుడికి కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మల్లయ్య, నారాయణ, బుచ్చయ్య, కృష్ణయ్య, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



రేపు బండలాగుడు పోటీలు

తాడూరు: మండల కేంద్రంలో 13న అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలు నిర్వహిస్తునట్లు శనివారం నిర్వాహకులు సంద మల్లయ్య, మల్లేష్, కోటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. పోటీల కోసం మైదానాన్ని చదునుచేస్తున్నామని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి హాజరవుతారని పేర్కొన్నారు. పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

సభకు తరలిన మాదిగ ఉద్యోగులు



నాగర్‌కర్నూల్‌రూరల్: హైదరాబాద్‌లోని ఉస్మానియ యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన మాదిగ మేధావుల సంఘీభావ మహాసభకు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి 100 మంది మాదిగ ఉద్యోగులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరపాగ ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలన్నారు. కరెంట్ లక్ష్మయ్య, సీ బాలస్వామి, వెంకటయ్య, కురుమూర్తి, డాక్టర్ రమేష్ చంద్ర, డాక్టర్ నారాయణ, మానస, మద్దిలేటి, రాంచందర్, బాలక్ష్మయ్య, సైదులు, రామకృష్ణ, భగవంత్, విష్ణుమూర్తి, అశోక్ తదిలరులు పాల్గొన్నారు.

వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

కల్వకుర్తి టౌన్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం చేకూరుతుందని మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ అన్నారు. శనివారం పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హైదారాబాద్‌లో జరుగుతున్న మేధావుల సదస్సుకు భారీగా తరలివెళ్లారు. గోపాల్ రావు, రామేశ్వరయ్య, మబ్బు సాయన్న, వీరస్వామి, నాగేష్, రాజన్న, రామస్వామి, నారాయణ, జగన్, పరశురాములు పాల్గొన్నారు.

జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా శ్రీనివాసచారి

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి గ్రామానికి చెందిన ఆందోజు శ్రీనివాసచారిని శనివారం బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తామన్నారు. సహకరించిన బీజేపీ రాష్ట్ర ఎన్నికల అధికారి యెండల లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామసభల్లో అర్హులను ఎంపిక చేయాలి



బల్మూర్: గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశ్యానాయక్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పారదర్శకంగా అర్హులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి శంకర్‌నాయక్, నాయకులు లాల్‌అహ్మద్, ఆంజనేయులు, బాలు, కృష్ణయ్య, లక్ష్మణ్, రాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి సర్వే

కల్వకుర్తి రూరల్: మండలంలోని ముకురాల నుంచి రంగాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణం కోసం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ.2.50 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా శనివారం బ్రిడ్జి నిర్మాణం పనులను పంచాయతీరాజ్ శాఖ ఏఈ షబ్బీర్ బ్రిడ్జి నిర్మాణం సంస్థ ఇంజనీర్ దేవేందర్ రెడ్డిలు పరిశీలించారు. నిర్మాణంపై సర్వే పనులు ప్రారంభించారు. త్వరలోనే పనులు చేపడతామన్నారు. కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డియ గ్రామస్తులు ఉన్నారు.

15న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పెద్దకారుపాములలో రైతు సంబరాలలో భాగంగా ఈ నెల 15వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంబరాల కమిటీ సభ్యులు తెలిపారు. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు ఇవ్వనునట్లు పేర్కొన్నారు. పోటీలో పాల్గొన్న ప్రతి జతకు ప్రోత్సాహక బహుమతి రూ.6 వేలు ఇస్తామని వివరించారు. మిగతా వివరాల కోసం సెల్: 8106894468 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ప్రయాణికులతో కిటకిటలాడిన బస్టాండ్



కందనూలు: సంక్రాంతి పండుగ, వరుస సెలవుల సందర్భంగా శనివారం ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంగణం కిటకిటలాడాయి. పల్లెలకు వెళ్లేందుకు వివిధ పట్టణాల నుంచి వచ్చారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాట్లు చేశారు. నాగర్‌కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక బస్సు సర్వీలను ఏర్పాట్లు చేసినట్లు నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ యాదయ్య తెలిపారు.

బెల్లం పట్టివేత

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని జేపీ నగర్ తండాలో శనివారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తుండగా టాటాఏస్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న బెల్లం, అల్లంను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ మాధవ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పట్టుబడిన వాహనంలో 24 క్వింటాళ్ల బెల్లం, 40 కిలోల అల్లంను గుర్తించారు. డ్రైవర్ మహ్మద్ సోహెల్ జహీరాబాద్‌కు చెందిన మహేష్, ఉప్పునుంతలకు చెందిన వ్యాపారితో కలిసి వీటిని తరలిస్తున్నట్లుగా గుర్తించారు. వాహనాన్ని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

లాల్ బహదూర్ శాస్త్రి సేవలు మరువలేనివి

కొల్లాపూర్: మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి సేవలు మరువలేనివని టీపీసీసీ సభ్యులు రంగినేని జగదీశ్వరుడు అన్నారు. శనివారం పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయంలో లాల్‌బహదూర్ శాస్త్రి 59వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జగదీశ్వరుడు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పేదలకు పండ్లు, బ్రెడ్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లాల్‌బహదూర్ శాస్త్రి నిజాయితీగల, నిరాడంబరుడైన నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూదన్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాముయాదవ్, నాయకులు వెంకటస్వామి, జమీల్‌అహ్మద్‌ఖాన్, జావేద్, జుబేర్ తదితరులున్నారు.


పండ్లు, బ్రెడ్లు అందజేస్తున్న రంగినేని జగదీశ్వరుడు

ముందస్తు సంక్రాంతి సందడి

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో శనివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాల వేడుకలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సంక్రాంతి స్టాల్‌లను ఆయన పరిశీలించారు. సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. శనివారం తాడూరుతో పాటు పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చిన్నారులు గాలిపటాలను ఎగురవేస్తూ కేరింతలు కొడుతూ సందడి చేశారు.


తాడూరులో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

ఘనంగా గోదాదేవి రంగనాయక స్వామి కల్యాణం



లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో శనివారం ధనుర్మాసం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు రామాచారి, సుదర్శనాచారి ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయం ఆవరణలో గోదా రంగనాయక స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. విష్ణు సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కల్వకుర్తిరూరల్: పట్టణంలో హైందవ శక్తి నూతన క్యాలెండర్‌ను శివాజీ సేవా కమిటీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి ఆవిష్కరించారు. హైందవశక్తి ద్వారా హిందువులను ఐక్యం చేయాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, సురేష్‌గౌడ్, రామకృష్ణ, నరేష్‌గౌడ్, వివేకనంద, మహేష్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శనివారం క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్మిచర్ల రమేష్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి క్లబ్ సహకారం అందిస్తుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, ప్రధాన కార్యధర్శి సాయిబాబు, రాఘవేందర్, లక్ష్మినర్సింహరావు, శోభన్‌బాబు, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

తిమ్మాజిపేట: మండల కేంద్రంలోని 3వ అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ టీచర్ జోగు పద్మ(40) అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. దాదాపు 20 సంవత్సరాలుగా అంగన్‌వాడి టీచర్‌గా సేవలు అందించారు. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలి

పాన్‌గల్: చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని సీహెచ్‌ఓ రామయ్య వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన మండలంలోని వెంగళాయిపల్లి, జమ్మాపూర్ సబ్ సెంటర్ల పరిధిలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, వ్యాధి నిరోధక టీకాలు, రికార్డులను తనిఖీ చేశారు. గర్భిణులకు వ్యాక్సినేషన్ చేసి, ఐరన్, కాల్షియం మాత్రలు, అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని ఆయన సిబ్బందికి సూచించారు. గర్భిణులకు రక్తశాతం పెరగడానికి ప్రతిరోజు తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్డు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం శైలజ, ఆశా కార్యకర్తలు నాగమణి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి



చారకొండ: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి బాస్కర్ రావు పేర్కొన్నారు. మండలంలోని జూపల్లిలో శనివారం సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య యాదవ్, ముస్తాఫా, బాలరాజు, జగపతి, రాములు యాదవ్, తదితరులు ఉన్నారు.

కోలాట కళాకారుడికి నంది అవార్డు పురస్కారం



అమ్రాబాద్: మండలంలోని కుమ్మరోనిపల్లికి చెందిన కల్మాల శివకుమార్ నంది పురస్కారం అందుకున్నారు. కోలాటం, భజనలో విశిష్ట కృషి చేసిన ఆయనకు శనివారం హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో సంస్థ ఫౌండర్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. మండలంలోని కోలాట, భజన కళాకారులు శివకుమార్‌ను అభినందించారు.

కండక్టర్ నిజాయితీ

కొల్లాపూర్: పట్టణ ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్ ఆంజనేయులు నిజాయితీ చాటుకున్నాడు. శనివారం పెబ్బేర్ నుంచి కొల్లాపూర్ వస్తున్న బస్సులో ప్రయాణికుడు అలీ అహ్మద్ ఫోన్ మర్చిపోయి వెళ్లాడు. కండక్టర్ ఆంజనేయులు ఫోన్ గుర్తించి డీఎం ఉమాశంకర్‌కు ఇచ్చారు. కొంచెం సమయానికి బాధితుడు ఫోన్ చేయడంతో వివరాలు తెలపడంతో కొల్లాపూర్ డిపోకు వచ్చాడు. దీంతో డీఎం ప్రయాణికుడిని ఫోన్‌ను అందజేసి కండక్టర్‌ను అభినందించారు.

ఆర్టీసీ అదనపు వసూలు




కొల్లాపూర్: సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణం నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుతున్నారు. సాధారణ రోజుల్లో కొల్లాపూర్ నుంచి హైదరాబాద్‌కు టికెట్ ధర రూ.260 కాగా, శనివారం ప్రత్యేక బస్సుల్లో రూ.360 చొప్పున వసూలు చేశారు. స్పెషల్ బస్సుల పేరుతో అదనపు వసూలు చేయడం ఏంటని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఆర్టీసీ డీఎం ఉమాశంకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి కొల్లాపూర్‌కు వచ్చే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉందని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం 9 అదనపు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే టికెట్ల ధరలు పెంచినట్లు వివరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

వెల్దండ: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. శనివారం మండలంలోని ఈదమ్మబండతండాలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడా పోటీలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డి, దశరథ్‌నాయక్, నాయకులు వెంకటేష్‌గౌడు, ఐజాక్, అనురాధ, పత్యానాయక్, వెంకటయ్యగౌడు, నిరంజన్, యాదగిరి, నరసింహ, హనుమంతునాయక్, రాజునాయక్, నాగయ్య, ప్రసాద్, అశోక్, శేఖర్, ఆనంద్, రవికుమార్, గణేష్, సైదులు, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శ

పెద్దాపూర్ గ్రామానికి చెందిన క్రాంతి అచ్చమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. శనివారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ విజితారెడ్డిలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు క్రాంతి అనంతరెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌నాయక్, మాజీ డైరెక్టర్ వీరారెడ్డి, కొండల్, గణేష్ తదితరులు ఉన్నారు.


క్రీడలను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్